సాక్షి వరంగల్

మంగళవారం । 14 । మే । 2024



అమ్మవారి ఊరేగింపు

శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్స వాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని సూర్య ప్రభ వాహనంపై ఊరేగించారు.

- 8లో▸



ఓటు వేసిన వీడియో వైరల్..

నెల్లికుదురు మండలంలోని హేమ్లాతండాలో ఓ వ్యక్తి ఓటు వేస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరలైంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$37^0/26^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఖానాపురంలో చోరీ

ఖానాపురం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం...మండల కేంద్రానికి చెందిన బైరు భద్రమ్మ రోజూమాదిరిగానే ఇంట్లో నిద్రిస్తుంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి ఇంట్లోకి చొరబడి 5 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.30 వేల నగదును అపహరించుకుపోయారు. కాగా చోరీకి పాల్పడిన వ్యక్తులు తెలివిగా వేలిముద్రలు పడకూడదనే ఉద్దేశంతో ఇంట్లో కారం, పసుపు చిందరవందరగా చల్లి వెళ్లిపోయారు. ఉదయం నిద్రలేచి ఇంట్లో చూడటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వివాహిత ఆత్మహత్య



రాయపర్తి: బావిలోకి దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని మొరిపిరాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వడ్డె సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాయితోజు విజయలక్ష్మి (40) పన్నెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని ఓ బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పార్టీలో గుర్తింపు ఇవ్వడం లేదని..

- డబ్బులు కాల్చిన మాజీ సర్పంచ్ భర్త
- ఎల్లాయగూడెంలో ఘటన



కాలిన నోటును చూపిస్తున్న జనార్దన్

చెన్నారావుపేట: తనకు గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గుర్తింపు ఇవ్వడం లేదని గ్రామ నాయకులపై అసహనంతో ఎన్నికల కోసం పంపిణీ చేసే డబ్బులను మాజీ సర్పంచ్ భర్త మంద జనార్దన్ కాల్చిన సంఘటన మండలంలోని ఎల్లాయగూడెంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ బీఆర్ఎస్ నాయకులకు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేయడానికి మండల నాయకులు రూ.15 లక్షలు ఇచ్చి వెళ్లారన్నారు. ఆ సమయంలో తన కు సమాచారం ఇవ్వకుండా అవమాన పర్చారన్నారు. తాజాగా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటర్లకు డబ్బులు పంపిణీకి మండల నాయకులు గ్రామ నాయకుల కు తెచ్చి ఇచ్చారని, అవి పంపిణీ కూడా త నకు సమాచారం లేదన్నాడు. అంతేకాకుండా ఇదే గ్రామానికి చెందిన అర్కాల రాజేందర్, మ హేందర్‌తో సామాన్య ఓటరుకు ఇచ్చినట్లు నా కు డబ్బులు పంపించారని ఆవేదన వ్యక్తం చేశా రు. ఆ డబ్బు నాకు అవసరం లేదని, వాటి కో సం ఆశ పడి లేనని ఆవేదనతో పక్కనే ఉన్న మంటల్లో వేశానన్నారు. దళితుడిని అయినందుకే నాయకులు చిన్న చూపు చూస్తున్నారని, ప్రాధాన్యం ఇవ్వడం లేదని వెల్లడించారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు

వరంగల్: పోలింగ్ అనంతరం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని రిసీవింగ్ సెంటర్‌కు ముందుగా వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లు అర్ధరాత్రి వరకు చేరుకున్నాయి. మిగిలిన నియోజవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు ఆయా జిల్లాల కేంద్రంలో ఏర్పాటు చేసిన రిసీవింగ్ సెంటర్లకు చేరుకుంటాయని తెలిసింది.

పోలింగ్ ప్రశాంతం

వరంగల్ లోక్‌సభ పరిధిలో పోలింగ్ 67.49 శాతం

- 2019 ఎన్నికలతో పోలిస్తే 3.80 శాతం పెరుగుదల
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు.. బారులు తీరిన జనం
- పోలింగ్ కేంద్రాల్ని పర్యవేక్షించిన ఆర్‌ఓ, కలెక్టర్లు, అధికారులు
- ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు, వీఐపీలు, ప్రజలు
- స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు భద్రం



ఏనుగల్లులో ఓటు వేయడానికి బారులుదీరిన మహిళలు



రంగశాయిపేటలో మొదటిసారి ఓటు వేసిన యువతి





ఓటు వేసిన కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్‌కిశోర్ ఝా



చెన్నారావుపేట: మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా సాగింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడింది మొదలు.. పోలింగ్ ముగిసే వరకు నిరంతరంగా శ్రమించిన రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కలెక్టర్లు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియ ఆద్యంతం సజావుగా సాగడంతో ఊపిరి పీల్చుకున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. భూపాలపల్లి నియోజకవర్గం, సమస్యాత్మక ప్రాంతాల్లో ఎప్పటిలాగే ఉదయం 7 గంటలకు ప్రారంభం కాగా.. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ను ముగించారు. వరంగల్ తూర్పు, పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల, పాలకుర్తి, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగింది. ఓటు వేసేందుకు ఆరు గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి స్లిప్‌లు ఇచ్చి రాత్రి 8 గంటల వరకు కూడా అవకాశం కల్పించారు. కాగా.. పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించిన వరంగల్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. హనుమకొండ, జేఎస్ భూపాలపల్లి, జనగామ జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు సిక్తా పట్నాయక్, భవేశ్‌మిశ్రా, రిజ్వాన్ బాషా షేక్, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఎస్పీ శబరీశ్‌లు, అధికారులు ఎన్నికల తీరును పర్యవేక్షించారు.

స్వల్పంగా పెరిగిన పోలింగ్‌శాతం

సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభించే క్రమంలో అక్కడక్కడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) మొరాయించడంతో అధికారులు సరిచేసినా.. అరగంట నుంచి గంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. దీంతో చాలా చోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. అన్ని చోట్లా ఉదయం ఏడు గంటలకు మందకోడిగా మొదలైన పోలింగ్ 10 గంటల తర్వాత పుంజుకుంది. కాగా.. వరంగల్ లోక్‌సభ స్థానంలో 67.49శాతంగా నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రాత్రి వరకు సాగింది. జీపీఎస్ వాహనాల ద్వారా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని గోదాంలకు తరలించారు. పటిష్ట పోలీసు భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లలో అధికారులు ఈవీఎంలను భద్రపర్చారు. స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంలలో దాగి ఉన్న అభ్యర్థుల భవితవ్యం జూన్ 4న తేలనుంది.

ఓటేసిన అభ్యర్థులు, వీఐపీలు, అధికారులు

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వీఐపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ఫాతిమానగర్‌లోని బిషప్‌బెరట్టా స్కూల్‌లోని పోలింగ్ బూత్ నంబర్ 175లో ఓటేశారు. హనుమకొండ 54వ డివిజన్‌లోని పోచమ్మకుంట తేజస్విని స్కూల్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కుటుంబ సభ్యులతో కలిసి హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేజ్-1 లోని కమ్యూనిటీ హాల్‌లో ఓటు వేశారు. న్యూశాయంపేటలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వరంగల్ పెరకవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 108 బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఆర్‌ఓ, కలెక్టర్ పి.ప్రావీణ్య హనుమకొండ హంటర్ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పోలింగ్ కేంద్రంలో హనుమకొండ కలెక్టర్, ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్, ఓటుహక్కును వినియోగించుకున్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్‌శాతం (సాయంత్రం 6 గంటలవరకు)

స్టేషన్‌ఘన్‌పూర్	78.54
పాలకుర్తి	71.54
పరకాల	72
వరంగల్ పశ్చిమ	50.27
వరంగల్ తూర్పు	63.05
వర్ధన్నపేట	71.04
భూపాలపల్లి	67.68

వరంగల్ పార్లమెంట్‌లో పోలింగ్ సరళి ఇలా..

సమయం	పోలింగ్ శాతం
7-9	8.97
9-11	24.48
11-01	41.23
1-3	54.17
3-5	64.08
5-6	67.49

2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి 3.80 శాతం పెరిగింది.

గత, ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్‌శాతం

2019లో	63.69
2024లో	67.49

(ఈ సంఖ్య మారుతుందని ఎన్నికల అధికారులు ప్రకటించారు)

స్టేషన్‌ఘన్‌పూర్‌లో అత్యధికంగా 78.54శాతం, అత్యల్పంగా వరంగల్ పశ్చిమలో 50.27శాతం పోలింగ్ నమోదైంది.

మొరాయించిన ఈవీఎంలు

- నెక్కొండ మండలం దీక్షకుంటలో 237 పోలింగ్ బూత్‌లో గంటపాటు, రెడ్లవాడలోని 259 పోలింగ్‌బూత్‌లో రెండు గంటల పాటు ఈవీఎంలు మోరాయించాయి. అధికారులు స్పందించి సరి చేయడంతో ఓటింగ్ సరళి కొనసాగింది.
- దుగ్గొండి మండలం పీజీతండాలోని 45వ నంబర్ పోలింగ్ కేంద్రంలో 59 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత ఈవీఎం మోరాయించింది. గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. మరో ఈవీఎంను ఏర్పాటు చేయడంతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



వర్ధన్నపేట: ఓటర్లతో మాట్లాడుతున్న అరూరి



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కడియం కావ్య

పోలింగ్ సరళి పరిశీలన



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న రణధీర్ చంద్



వర్ధన్నపేటలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న సీపీ

వర్ధన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల అబ్జర్వర్ బండారి రణధీర్ చంద్ వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అలాగే వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని పరిశీలించి పోలీసు అధికారులకు సలహాలు సూచనలు అందించారు. దివ్యాంగులు, వృద్ధులు వచ్చినప్పుడు వారిని బూత్‌లోకి జాగ్రత్తగా తీసుకెళ్లి ఓటు వేసే విధంగా అధికారులు చూడాలన్నారు. తహసీల్దార్ విజయసాగర్, ఏసీపీ నరసయ్య, సీఐ సూర్య ప్రకాష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పోలీస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రవాణా సౌకర్యం కల్పించారు..

సాక్షి స్పందన



ఓటు వేసేందుకు ట్రాక్టర్‌లో వస్తున్న మురళీనగర్ గ్రామస్తులు



ఆటోలో ఓటర్లతో వస్తున్న పంచాయతీ కార్యదర్శి రజిత

నల్లబెల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొండాపూర్ శివారు మురళీనగర్, గణేష్‌నగర్ గ్రామాల ఓటర్లకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఈ నెల 13న సాక్షిలో ఓటు కోసం 4 కిలోమీటర్ల నడక శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రజిత మురళి నగర్, గణేష్ నగర్ గ్రామాలకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ఓటర్లకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. రవాణా సౌకర్యం కల్పించిన అధికారులకు ఆయా గ్రామాల ఓటర్లు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక కేంద్రాలు

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య



మహిళా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ సెంటర్/వరంగల్: మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక (మోడల్) పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి మండిబజార్ కిడ్డీ కూప్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించి, పోలింగ్ తీరును పరిశీలించారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతీ సెగ్మెంట్‌లో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు స్వాగతం పలికేలా ఆహ్వాన బ్యానర్, ఎంట్రెన్స్ నుంచి గ్రీన్ కార్పెట్ ఏర్పాటుతో పాటు బెలూన్లతో అలంకరణ, అన్ని టేబుళ్లను వస్త్రంతో కప్పి ఉంచడం, ఓటు వేయడానికి వచ్చే తల్లులతో వచ్చే పిల్లలు ఆడుకోవడానికి ఆట బొమ్మల ఏర్పాటు, మహిళా పోలింగ్ సిబ్బందికి ఏకరూప దుస్తులు ధరించి విధుల నిర్వహణ, ప్రత్యేకంగా ఫీడింగ్ రూం ఏర్పాటు, పోలింగ్ కేంద్ర లాణలో రంగవల్లులు, సెల్ఫీ పాయింట్, వాష్ రూంల ఏర్పాటు, సహాయం అందించడానికి మహిళా సహాయకులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వరంగల్‌లో ఈవీఎంలు సీల్ చేస్తున్న అధికారులు

మంచి భవిష్యత్‌కే తొలి ఓటు

- మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత మనోగతం

- వివరాలు 8లో▸

ఓటెత్తారు..

- మరిన్ని ఫొటోలు 8,9లో▸

ప్రముఖులు ఓటేశారు

- వివరాలు 10లో▸

అకాల వర్షం.. రైతన్నకు తీరని నష్టం



చెన్నారావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

చెన్నారావుపేట/వర్ధన్నపేట: అకాల వర్షం రైతన్నలను ఆగం చేసింది. విక్రయించడానికి తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. పొలంలో కోతకు వచ్చిన పంట నేలపాలైంది. జిల్లాలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షానికి అన్నదాతలకు తీరని నష్టం మిగిల్చింది. జిల్లాలోని వర్ధన్నపేట, సంగెం, నర్సంపేట, దుగ్గొండి, చెన్నారావుపేట, నల్లబెల్లి, గీసుకొండ, ఖానాపురం తదితర మండలాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. దీనికి తోడు మామిడి కాయలు రాలిపోయి మామిడి రైతులు తీవ్రంగా నష్ట పోయారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోయిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పుకునేందుకు రైతులు కష్టాలు పడ్డారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వరదకు కొట్టుకుపోయింది..



తిమ్మరాయినిపహాడ్ శివారులో నాలుగున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశా. పంట కోసి తిమ్మరాయినిపహాడ్ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. రూ.80 వేల వరకు పెట్టుబడి అయింది. తడిసి సుమారుగా రూ.60 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎండీ యాకూబ్, తిమ్మరాయినిపహాడ్



దుగ్గొండి: జీడికల్ గ్రామంలో దెబ్బతిన్న అరటి తోట



వర్ధన్నపేట: ఇల్లంద మార్కెట్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం



నర్సంపేట రూరల్: ముగ్దుంపురం శివారులో నేలవాలిన వరి పంట



వర్ధన్నపేట: కొట్టుకుపోతున్న ధాన్యం

ఖానాపురంలో 104 మిల్లీమీటర్ల వర్షపాతం



ఖానాపురం: ధాన్యంలో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు

జిల్లాలో అత్యధికంగా ఖానాపురం మండలం మంగళవారిపేటలో 104 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా రాయపర్తిలో 11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దుగ్గొండిలో 50.3 మిల్లీ మీటర్లు, వరంగల్ ఉర్సులో 61.3, పర్వతగిరి మండలం కల్లెడలో 25.3, గీసుకొండ మండలం గొర్రెకుంటలో 87, ఖానాపురం మండలం మంగళవారిపేటలో 104, రాయపర్తిలో 11, పర్వతగిరి మండలం ఏనుగల్లులో 11, నల్లబెల్లిలో 31.8, చెన్నారావుపేటలో 75, సంగెంలో 18.5, సంగెం కాపులకనపర్తిలో 68.3, గీసుకొండలో 59.3, నల్లబెల్లి మండలం మేడపల్లిలో 10.5, నెక్కొండలో 32, వరంగల్ కాశిబుగ్గలో 62.3, వరంగల్ పైడిపల్లి (ఎఆర్ఎస్)లో 83.5, నెక్కొండ మండలం రెడ్లవాడలలో 30, వర్ధన్నపేటలో 14.8, నర్సంపేట లక్నేపల్లిలో 22.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షంతో ఎన్పీడీసీఎల్‌కు నష్టం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఈదురు గాలులు, భారీ వర్షం టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు భారీ నష్టాన్ని చేకూర్చింది. ఆదివారం రాత్రి హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఈదురుగాలులు వీచడంతో పాటు భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు వృక్షాలు కూలడంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ లైన్లు తెగిపడి సరఫరాలో ఆటంకం ఏర్పడింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అర్ధరాత్రి క్షేత్రస్థాయిలో పర్యటించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. తెల్లవారితే పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో పోలింగ్‌కు అంతరాయం కలగకుండా, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది అర్ధరాత్రి దాటే వరకు శ్రమించారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఎప్పటికప్పుడు ఎస్ఈ, డీఈలతో మాట్లాడుతూ.. సలహాలు, సూచనలిస్తూ.. క్షేత్రస్థాయిలో పర్యటించారు. రాయపర్తి, వర్ధన్నపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, పెద్ద నాగారం, ఘన్‌పూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఇంజనీర్లకు సూచనలిచ్చారు. అర్ధరాత్రి విద్యుత్‌ను పునరుద్ధరించిన ఉద్యోగులను అభినందించారు. విద్యుత్ సంబంధిత సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 18004250028, లేదా 1912కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

వరంగల్‌లో ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని వాణి విద్యానికేతన్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి బారులుదీరిన ట్రాన్స్‌జెండర్లు



పోల్.. కూల్..

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ఉదయం 7 గంటల ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4గంటలకే ముగిసింది. ఓటు వేయడానికి ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. దివ్యాంగులు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీల్‌చైర్‌లు, ఆటోల ద్వారా తరలించి ఓటు వేయించారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.



జనగామ స్టేషన్ రోడ్ హైస్కూల్‌లో..



ఖానాపురం: బుధరావుపేటలో బారులుదీరిన ప్రజలు



ఆత్మకూరు : కటాక్షపూర్‌లో క్యూలైన్‌లో ఓటర్లు



చిన్నగూడూరు: ఓటు వేసేందుకు ట్రాక్టర్‌లో వస్తున్న గిరిజనులు



పర్వతగిరి : వృద్ధుడికి బూత్ వివరాలు తెలుపుతున్న తహసీల్దార్



గుంటూరుపల్లిలో బారులుదీరిన ఓటర్లు



భూపాలపల్లి రూరల్: రామయ్యపల్లిలో బారులుదీరిన ఓటర్లు



జనగామ అంబేద్కర్ నగర్‌లో బారులుదీరిన ఓటర్లు

ఓటు.. భవిష్యత్‌కు పునాది

ఓటు హక్కు.. దేశ భవిష్యత్‌కు పునాది. స్థానిక సంస్థల నుంచి మొదలు.. లోక్‌సభ వరకు దేశ భవితవ్యం నిర్ణయించే ఎన్నికలు ఇవి. ఇందులో పౌరులు ఎలాంటి లాభాపేక్ష లేకుండా తమ ఓటు అనే వజ్రాయుధం ద్వారా సరైన నాయకుడిని ఎన్నుకుంటేనే దేశం అభివృద్ధిలో పయనిస్తుంది. లేనిపక్షంలో భవిష్యత్‌లో అంధకారం నెలకొంటుంది. కాగా, దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఈ నేపథ్యంలో ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి యువతీయువకులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

– ఖిలా వరంగల్/వరంగల్/మహబూబాబాద్ రూరల్/ భూపాలపల్లి రూరల్



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మంచి నేతకు తొలి ఓటు వేశా



వరంగల్ శివనగర్ ప్రకాశ్ మెమోరియల్ హైస్కూల్‌లోని 167వ పోలింగ్ బూత్‌లో నా తొలి ఓటు హక్కు వినియోగించుకున్నా. నిజాయితీ గల మంచి నాయకుడికి ఓటు వేశా. అభివృద్ధిని ఆకాంక్షించి మంచి నాయకుడి గెలుపునకు ఓటు వేశా.

– శామంతుల తేజ్ దీప్తి, శివనగర్

ఓటు వజ్రాయుధం



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. ఓటు వజ్రాయుధం. ఎన్నికల సంఘం ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపునిచ్చింది. యువ ఓటర్లలో వచ్చిన చైతన్యమే మంచి నేత విజయానికి తోడ్పాటు అందిస్తుంది. – లైలా, ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ ప్రతినిధి

తొలి ఓటు వేయడం ఆనందంగా ఉంది



ఓటు హక్కు వచ్చిన తర్వాత తొలిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. నా తొలి ఓటును ప్రజా సమస్యలు తీర్చే, అభివృద్ధి చేసే, నీతి, నిజాయితీ గల మంచి నాయకుడిని ఎంచుకొనేందుకు వేశా. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది. – ఎస్.సునాయన దీప్తి, శివనగర్, వరంగల్

అభివృద్ధికే నా తొలి ఓటు



అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చిన నాయకుడికి నా తొలి ఓటు వేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుత రాజకీయాల్లో అవినీతి, బంధు ప్రీతి, స్వార్థాన్ని నివారించాలంటే నిజాయితీ గల నాయకులను గెలిపించాలి. అందుకు యువత తమ చేతిలో ఉన్న ఓటు అనే ఆయుధాన్ని సమర్థంగా వాడుకోవాలి. భవిష్యత్‌లో మంచి రాజకీయ వ్యవస్థను నిర్మించే బాధ్యత యవతరంపైనే ఉందని నా అభిప్రాయం.

– మునుగోటి మిఖిలి, పెరకవాడ వరంగల్

ఓటుతో ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తాం



ఓటుతో ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తాం. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. నేను కూడా సమాజంలో గుర్తింపు పొందా. ఎదుటి వారికి ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేస్తాననే నమ్మకం కలిగింది. ఓటు హక్కుతో మంచి ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలి.

– గుగులోత్ అంకిత, మహబూబాబాద్

సంతోషంగా ఉంది



మొదటి సారిఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. రాజ్యాంగం.. ఓటు ద్వారా మనకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే గొప్ప అవకాశం కల్పించింది. ఓటు విలువైంది.

– రాంనేని భార్గవి, గొర్లవీడు, భూపాలపల్లి

ఓటు హక్కు గొప్పది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గొప్పది. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నా. ప్రజలకు సేవ చేసే నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే గొప్ప అవకాశం రాజ్యాంగం మనకు కల్పించింది.

– గోరంటల మణిచరణ్, బీటెక్, ఫైనలియర్, వరంగల్

మంచి నాయకుడిని ఎన్నుకోవడం అదృష్టం



నేను మొదటిసారి ఓటు వేసినందుకు గర్వపడుతున్నా. ఒక మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి నా ఓటు హక్కు దోహదపడింది. దేశానికి సేవ చేసే ప్రజాప్రతినిధులు.. ఎన్నికైన అనంతరం అందరికీ మేలు చేయాలి. అదే నా కోరిక.

– గుగులోత్ నిఖిత, మహబూబాబాద్

ఓటు కోసం ఖండాతరాలు దాటిన ఎన్‌ఆర్‌ఐ..

● స్ఫూర్తి నింపిన విష్ణువర్ధన్‌రెడ్డి



సిరా చుక్క చూపుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

గీసుకొండ : ఓ ఎన్‌ఆర్‌ఐ ఓటు విలువ చాటి చెప్పాడు. అమెరికాలో ఉన్న తాను ఓటు హక్కు వినియోగించుకుని పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన వీరాటి రవీందర్‌రెడ్డి, స్వర్ణ దంపతుల కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ చదవడానికి అమెరికాలో వెళ్లాడు. ఎంఎస్ పూర్తి చేసి ఐదేళ్లుగా అమెరికాలోనే ఉంటూ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు ఉన్నాయని తెలిసి ఐదు రోజుల క్రితం ఓటు వేయడానికి స్వగ్రామం వచ్చాడు. అమెరికా నుంచి రానుపోను ఫ్లైట్ చార్జీలు రూ. 2 లక్షలు చెల్లించి సోమవారం కొమ్మాలలో ఓటు వేశాడు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

కమలాపూర్‌లో మరో యువకుడు..



ఓటు హక్కు వినియోగించుకున్న సందీప్

కమలాపూర్: కమలాపూర్‌కు చెందిన మాట్ల సందీప్ అమెరికా నుంచి వచ్చి తన స్వగ్రామం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన మాట్ల శంకర్, సరోజన దంపతుల రెండో కుమారుడు సందీప్ ఉన్నత చదువు నిమిత్తం ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లాడు. తెలంగాణలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అమెరికా నుంచి వచ్చి ఓటు వేశాడు. తాను కేవలం ఓటు హక్కు వినియోగించుకోవడం కోసమే అమెరికా నుంచి వచ్చినట్లు తెలిపాడు. కాగా, సందీప్‌ను పలువురు అభినందించారు.

ఓటు వేసి ఇంటికి వచ్చి అనంతలోకాలకు..

● గుండెపోటుతో మహిళ మృతి



వీరమ్మ(ఫైల్)

నర్సింహులపేట: ఓటు వేసి ఇంటికి వచ్చిన అనంతరం ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండలంలోని కొమ్ములవంచలో జరిగింది. గ్రామానికి చెందిన దొంతు వీరమ్మ (58) తన కుమారుడు అశోక్‌తో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసింది. తిరిగి ఇంటికి రాగానే గుండెపోటుకు గురై మృతి చెందింది. వీరమ్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మూడు గుట్టలు..16 కిలోమీటర్లు..

● కాలినడకన వచ్చి ఓటు వేసిన పెనుగోలు వాసులు



ఓటు వేయడానికి వస్తున్న పెనుగోలు గిరిజనులు

వాజేడు: అది గుట్టలపై ఉన్న ఆదివాసీల కుగ్రామం. మండల పరిధిలోని కొంగాల గ్రామ పంచాయతీలో ఉన్న పెనుగోలు. ఇక్కడ 12 కుటుంబాలు, 30 మంది జనాభా ఉంది. ఈ గ్రామంలో 22 మంది ఓటర్లు ఉన్నారు. రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును క్రమం తప్పకుండా వినియోగించుకుంటున్న వీరు.. సోమవారం కూడా మూడు గుట్టలు దిగి వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు. గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామం నుంచి కాలి నడకన గుమ్మడి దొడ్డి వరకు 16 కిలో మీటర్లు వచ్చిన వారిని.. తహసీల్ కార్యాలయ సిబ్బంది ఆటో ద్వారా జంగాలపల్లి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఓటు వేసిన తరువాత వారు విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలని గుట్టలు దిగి వచ్చి ఓటు వేసినట్లు తెలిపారు.

ఓటు వేసిన వీడియో వైరల్..

● వ్యక్తిపై కేసు నమోదు

నెల్లికుదురు : మండలంలోని హేమ్లా తండాలో ఓ వ్యక్తి ఓటు వేస్తూ వీడియో తీశాడు. అనంతరం సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరలైంది. ఈ ఘటనలో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ సోమవారం తెలిపారు. తండాలోని 160 పోలింగ్ కేంద్రంలో తండాకు చెందిన బానోత్ బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తున్న వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య పోలింగ్ కేంద్రం సమీపంలో స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎస్. నాగరాజు ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

మానుకోటలో యువకుడిపై..

మహబూబాబాద్ రూరల్ : తాను ఓ పార్టీకి ఓటు వేసిన దృశ్యాలను ఓ యువకుడు సోషల్ మీడియాలో పోస్టు చేయగా అతడిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురం గ్రామానికి చెందిన దేవనబోయిన శ్రీకాంత్ స్థానిక పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అదేవిధంగా తాను ఏ పార్టీకి ఓటు వేశాడో అనే విషయ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీంతో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వీరన్న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.



హేమ్లాతండాలో ఘర్షణ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

వీవీ ప్యాట్ ఫొటో వైరల్



వాట్సాప్‌లో వైరలైన వీవీ ప్యాట్‌లోని ఫొటో

సంగెం: మండలంలోని ఎల్గూర్‌స్టేషన్‌లోని 211 పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాట్‌లో వచ్చిన ఫొటో తీసి గుగులోత్ గోపి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశాడు. దీంతో అతడిపై చర్య తీసుకోవాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల సెక్టార్ అధికారి సాయిరాజ్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సెక్టార్ అధికారి సాయిరాజ్ తెలిపారు.

పోలింగ్ బహిష్కరించిన చింతలగడ్డ వాసులు

● బూత్ ఏర్పాటు చేయకపోవడంపై నిర్ణయం
● 295 ఓట్లకు గానూ 15 మందే ఓటు హక్కు వినియోగం

మరిపెడ రూరల్: సుదూర ప్రాంతంలో ఉన్న తమ తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కొద్ది రోజులుగా విన్నవించినా తమ మాటను అధికారులు లెక్క చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ మండలం చింతలగడ్డ తండా వాసులు సోమవారం పోలింగ్ బహిష్కరించారు. తాళ్లఊకల్ రెవెన్యూ పరిధిలోని చింతలగడ్డతండా, రేఖ్యతండా, రూప్‌సింగ్‌తండాను కలిపి చింతలగడ్డతండా జీపీగా ఏర్పాటు చేశారు. 295 ఓట్లు ఉన్న చింతలగడ్డతండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని 20 రోజులుగా అధికారులకు విన్నవిస్తే పట్టించుకోలేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రూప్‌సింగ్ తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి నడవలేక పోతున్నామని, కావాలనే తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓటు వేయడానికి వెళ్లమని తండావాసులు మొండికేశారు. విషయం తెలుసుకున్న మరిపెడ తహసీల్దార్ సైదులు, సీఐ హతిరాంనాయక్, ఎస్సై షేక్ తాహేర్‌బాబా.. తండాకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ససేమిరా అనడంతో చేసేది లేక ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి తండాకు బూత్ మంజూరయ్యేలా చూస్తామని సర్ది చెప్పి వెనుదిరిగారు. కాగా, అధికారులు వెళ్లాక కేవలం 15 మంది మాత్రమే వెళ్లి రూప్ సింగ్‌తండా పోలింగ్ కేంద్రంలో ఓటు వేసినట్లు తెలిసింది.



నిరసన వ్యక్తం చేస్తున్న చింతలగడ్డతండా ఓటర్లు

సూర్యప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం నుంచి నిత్యాహ్నికం జరిపి అనంతరం చతుస్థానార్చన సదస్యం నిర్వహించారు. అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని సూర్యప్రభవాహనంపై జైభద్రకాళి అంటూ జయజయధ్వానాలు చేస్తుండగా మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణలతో ఊరేగించారు. అదే విధంగా సాయంత్రం హంసవాహనంపై ఊరేగించారు. పూజా కార్యక్రమాలకు బాకరాజు చంద్రశేఖర్‌రావు, రాజశ్రీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.





శ్రీభద్రకాళి అమ్మవారు, సూర్యప్రభవాహనంపై అమ్మవారు

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం



జి వర్ష



తేజస్వి



మేఘన

విద్యారణ్యపురి: సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు ఎ మధుకర్‌రెడ్డి, ఎ సంతోష్ తెలిపారు. 500 మార్కులకుగాను జి వర్ష 485, టి సాయి ప్రణవ్‌రెడ్డి 484, ప్రేమ్‌చరణ్‌సాహు 481 మార్కులు, డి శ్రేష్ఠరెడ్డి 477 మార్కులు సాధించారని వారు తెలిపారు. ఈ విజయానికి కారణం క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్ట ప్రణాళిక, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం అని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

12వ తరగతి ఫలితాల్లో..

సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు ఎ మధుకర్‌రెడ్డి, ఎ సంతోష్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీలో 500 మార్కులకు పి మేఘన 482 , తుమ్మ తేజస్వి 480, రిషికేష్‌రెడ్డి 478 మార్కులు సాధించారని తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

ఏకశిల విద్యాసంస్థల విజయభేరి

హసన్‌పర్తి: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏకశిల విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. 500 మార్కులకు 483, 479, 479, 478, 477, 476 మార్కులు సాధించినట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కూడా సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థల హవా కొనసాగిందన్నారు. ఉపాధ్యాయుల కృషి ఫలితమే ఈ ఫలితాలు అన్నారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కేడీ స్వర్ణరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి

గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



అరుణ్‌బాబు



ఎం హర్షిణి

కాజీపేట అర్బన్ : సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల ఫలితాల్లో గ్రీన్‌వుడ్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, డాక్టర్ గిర్రెం భరద్వాజనాయుడు తెలిపారు. 500 మార్కులకు టి అరుణ్ బాబు 490, ఎం హర్షిణి 489, కె శృతీష్‌రెడ్డి 487, ఇ కారుణ్య 487, కె ప్రీతికారెడ్డి 484, సీహెచ్ వేదజ్ఞ 483 మార్కులు సాధించారన్నారు. 440 మార్కులపైన సాధించిన విద్యార్థులు 65 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు. గ్రీన్‌వుడ్ మేనేజర్ ప్రభుకుమార్, అకడమిక్ ప్రిన్సిపాళ్లు వి నవీన్‌కుమార్, మంజుల, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ టి పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి సురేష్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ షేక్ రబ్బాని మురళి, అకడమిక్ కోఆర్డినేటర్స్ శ్రీకాంత్, హర్ష అభినందించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ఎల్కతుర్తి: అనారోగ్య సమస్య కారణంగా మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మంగళంపల్లిలో జరిగింది. వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దంపు శోభ(42) గతంలో పురుగుల మందు తాగింది. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. ఎన్ని ట్యాబ్లెట్లు వాడినా తగ్గకపోగ మరింత పెరిగాయి. దీంతో ఈ బాధ భరించలేక మనస్తాపానికి గురైన శోభ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

వడదెబ్బతో కార్మికుడి మృతి

బయ్యారం: వడదెబ్బతో తునికాకు కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధి సింగారంలో జరిగింది. గ్రామానికి చెందిన సూర్నబాక జగ్గయ్య(59) ఆదివారం తునికాకు సేకరణకు వెళ్లాడు. అదే రోజు రాత్రి అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.